

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రశాంతం

తొలి రోజు 334 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం జరిగిన ఇంటర్ సెకండ్ ఇయర్ సెకండ్ లాంగ్వేజ్ తెలుగు, సంస్కృతం, అరబిక్, హిందీ, ఉర్దూ పరీక్షలకు 15,361 మంది హాజరు కావలసి ఉండగా 15,027 మంది పరీక్షలు రాశారు. 334 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 21 రూరల్ ఏరియాల్లో ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని ఇంటర్ బోర్డు ప్రకటించడంతో విద్యార్థులు 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దాదాపు అన్ని కేంద్రాల్లో 8.45 గంటల వరకే చేరుకున్న విద్యార్థులు తరగతి గదిలోకి అనుమతించే వరకు పరీక్షా కేంద్రాల వద్దనే చదువుకున్నారు. అంధ విద్యార్థులు సహాయకులతో పరీక్షలు రాశారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ, పోలీసు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశాయి.



పరీక్ష కేంద్రం వద్ద చదువుకుంటున్న విద్యార్థినులు

మెగా డీఎస్సీతో చిగురించిన ఆశలు



- జిల్లాలో 225 ఉపాధ్యాయ పోస్టులు
- మరో 20 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను 2018లో భర్తీ చేసింది. ఆ తర్వాత నుంచి ప్రభుత్వం టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నిర్వహిం చిన ప్రభుత్వం 2023లో సెప్టెంబరు 6న 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా 1,77,000 మంది దర ఖాస్తు చేసు కున్నారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. గత ఎన్నిక లకు ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. గురు వారం రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టులను భర్తీ చేసేం దుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న 5,089 పోస్టులతో పాటు కొత్తగా మరో 5,973 ఖాళీ పోస్టులను భర్తీ చేయ నున్నట్లు ప్రకటించింది.

పెరిగిన పోస్టులు

తాజా నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య దాదాపు రెట్టింపు కంటే ఎక్కువగానే పెరిగాయి. గత నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ, లాంగ్వేజ్ పండిట్‌లతో కలిసి మొత్తం 99 పోస్టులుండగా మెగా డీఎస్సీలో పోస్టుల సంఖ్య 225కు చేరాయి. వీటితోపాటు అదనంగా మరో 20 ప్రత్యేక ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ ఐదు, ఎస్జీటీ 15 పోస్టులు కూడా జత చేశారు. దీంతో జిల్లాలో 245 మందికి ఉపాధ్యాయ పోస్టులు వచ్చే అవకాశం ఏర్పడింది. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 86, లాంగ్వేజ్ పండిట్లు 18, పీఈటీలు 7, ఎస్జీటీలు 114, మొత్తం 225 ఖాళీలు ఈ డీఎస్సీలో భర్తీ కానున్నాయి.

గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం

గత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మార్చి 4 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈసారి పరీక్షలను గతంలో మాదిరిగా కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని విద్యాశాఖ సూత్రప్రాయంగా తెలిపింది. పరీక్షలను ప్రశాంతంగా, ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా, అక్రమాలకు, పైరవీలకు తావులేకుండా నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు.



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు (ఫైల్)

పొదుపు చేయడం అలవాటుగా మార్చుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 29: విద్యార్థులు డబ్బులు పొదుపు చేయడం అలవాటుగా మార్చుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బొమ్మకల్ బైపాస్ రోడ్‌లోని గిరిజన సంక్షేమ గురు కుల బాలుర డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్ష రాస్యత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు గురువా రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనవసర ఖర్చులకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను కొనితెచ్చు కోవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లకు వచ్చే మేసేజ్‌లకు స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ మేనేజర్ సాయితేజారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, మెప్మా పీడీ రవీందర్, తహసీల్దార్ నవీన్ కుమార్, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మూడు నెలలుగా అందని వేతనాలు



ఉల్లంపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఇబ్బందుల్లో ఉపాధి హామీ కూలీలు

చిగురుమామిడి, ఫిబ్రవరి 29: వేతనాలు అందక ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఈసారి వేసవి ప్రారంభంలో సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి. ఎక్కడా పని దొరకడం లేదు. దీంతో పెద్ద ఎత్తున రైతు కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. మండల వ్యాప్తంగా 5,582 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 4,917 మంది కూలీలు పనులు చేస్తున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలకు డిసెంబరు నుంచి వేతనాలు అందడం లేదు. 63.92 లక్షల రూపాయల వేతనాలు రావల్సి ఉన్నది. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. వేతనాలు త్వరగా విడుదల చేయాలని కోరుతూ ఉపాధి కూలీలు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. మండుటెండలో ఎంతో కష్టపడి పని చేస్తున్నా ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నాం

పుప్పాల సత్యనారాయణ, ఉల్లంపల్లి



వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులకు వెళుతు న్నాం. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా మాకు రావల్సిన డబ్బులు చెల్లించాలి. లేకపోతే ఆందోళనలు చేస్తాం.

ఎవ్వరికి చెప్పినా పట్టించుకోవడం లేదు..

ఎలగందుల సత్తవ్వ, ఉల్లంపల్లి



రోజు కూలీ పనులు చేసుకుంటేనే కుటుంబం గడుస్తుంది. మూడు నెలలుగా డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో ఇబ్బంది పడుతున్నాం. ఎవ్వరికి చెప్పినా పట్టించుకోవవడం లేదు. పనులు చుడడానికి వచ్చిన సార్లకు చెప్పినా ఫలితం లేదు. ఇప్పటికైనా కూలి పైసలు ఇవ్వాలి.

గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లిం చాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ కోరారు. గురువారం యూనియన్ ఆధర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా గ్రామ పంచాయతీ కార్మికుల బతుకులు మారడంలేదన్నారు. రెండు నెలలుగా కార్మికులకు జీతాలు రావడం లేదన్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో రెండు నుంచి పది నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి జీతాలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 51 జీవో ప్రకారం రూ. 9,500 వేతనం ఇవ్వాల్సి ఉన్నప్పటికి కొన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, ఉపాధ్యక్షుడు కాశిపాక శంకర్, కోశాధికారి ఎండిగ రవీందర్‌రావు, కండె సదయ్య, వడ్లూరి లక్ష్మీనారాయణ, మహంకాళి కొమురయ్య, సారయ్య, మధు, శనిగరం కొమురయ్య పాల్గొన్నారు.

కరీంనగర్‌కు చేరుకున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 29: ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు కరీంనగర్ కమిషనరేట్‌కు చేరుకున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కమిషనరేట్ వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రాపిడ్‌యాక్షన్ ఫోర్స్ బలగాల సేవలు వినియోగించు కోనున్నారు. ఈ సందర్భంగా గురువారం కమిషనరేట్ కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో సీపీ అభిషేక్ మొహంతి పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు నిర్వహించాల్సిన విధుల గురించి పలు సూచనలు చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా పలు సమస్యాత్మాక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్, రూట్ మార్చ్‌లు నిర్వహించాలన్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధాల ప్రదర్శన, కళాశాలల్లో విద్యార్థులతో సమావేశాలు నిర్వహణకు ప్రణాళికలను రూపొందించామన్నారు.

నగరంలో ఫ్లాగ్‌మార్చ్

ఫెమిలైజేషన్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా కరీంనగర్‌కు వచ్చిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో గురువారం సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏ ఎఫ్)బలగాలతో పాటు స్థానిక పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీం పోలీసులు పాల్గొన్నారు. కరీంనగర్‌లోని కమాన్ నుంచి ప్రారం భమైన ఈ ఫ్లాగ్ మార్చ్ బోట్ జంక్షన్, అశోక్‌నగర్, నాకా చౌరస్తా, పాత శివాలయం, రాజీవ్ చౌక్ మీదుగా టవర్ సర్కిల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ బిస్వ రంజన్ సాహు, అడిషనల్ డీసీపీ సి రాజు, ఏసీపీ నరేందర్, సీఐలు రవీంద్ర రోషన్ (ఆర్ఏఎఫ్), లలితగోప్ నారాయణ్ (ఆర్ఏఎఫ్), సరిలాల్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.



కమాన్ వద్ద ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పోలీసులు

ఆస్తి పన్ను చెల్లింపులకు వన్ టైం సెటిల్‌మెంట్

- బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ
- వడ్డీ చెల్లించిన వారికి వచ్చే పన్నులో జమ



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఆస్తిపన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వన్ టైం సెటిల్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలను ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీలో 90 శాతం మాఫీ చేసింది. గతంలో వడ్డీతో ఆస్తి పన్నులను చెల్లించిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తూ వడ్డీలో 90 శాతం డబ్బులను వచ్చే పన్నుల్లో సర్దుబాటు చేస్తామని ప్రకటించింది. ఆస్తి పన్ను బకాయిదారులకు ఈ స్కీం ఊరట కలిగించనున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020-21లో కూడా ఇదే తరహాలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేస్తూ 90శాతం వడ్డీని మాఫీ చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఊరట కలిగిస్తూ 90 శాతం వడ్డీ మాఫీ చేసింది. జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటుగా హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సి పాలిటీల్లో కూడా ఆస్తిపన్ను చెల్లింపుబకాయిదారులకు భారీ ఊరట లభించనున్నది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మేయర్ సునీల్‌రావు



రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ స్కీమ్‌ను ప్రకటించింది. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలి.

కరీంనగర్‌లో రూ. 18.19 కోట్ల బకాయిలు

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 81,481 నివాస, వాణిజ్య గృహాలున్నాయి. వీటిద్వారా గత ఇప్పటి వరకు ఉన్న బకాయిలతో కలిసి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్నులు 43.25 కోట్ల రూపాయల వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 25.06 కోట్ల రూపాయల పన్నులు మాత్రమే వసూలయ్యాయి. 51,477 గృహాలకు సంబంధించిన 18.19 కోట్ల రూపాయల ఆస్తిపన్నులు వసూలు కావలసి ఉన్నది. వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్‌తో దాదాపు నగరంలోని 50శాతం ఇంటి యజమానులకు ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో గురువారం వేంకటేశ్వర కల్యాణం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని గుట్టపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. కోరుట్ల జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కారుగూరి నర్సయ్య పాల్గొన్నారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 618క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం క్వింటాల్ పత్తి 7,400 పలికింది. ప్రస్తుతం మరో 150 రూపాయలు పెరుగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన

బ్లూకోల్ట్స్ సిబ్బందికి సీపీ రివార్డు


కానిస్టేబుల్‌కు నగదు రివార్డును అందజేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం/ వీణవంక, ఫిబ్రవరి 29: పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌కు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నగదు రివార్డు అందజేసి అభినందించారు .మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన కుర్ర సురేష్ ఇంట్లో గొడవపడి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి డయల్ 100 కు కాల్ చేశారు. సమాచారం అందకున్నా బ్లూకోల్ట్స్ సిబ్బంది 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను కానిస్టేబుల్ జైపాల్ తన భుజాన వేసుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర పొలాల గట్ల మీద పరిగెడుతూ గ్రామంలోకి తీసుకొచ్చాడు. అనంతరం అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించి ప్రాణాలను కాపాడారు. వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు పరిస్థితులకు అనుకూలంగా వ్యవహరించిన కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌లను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని వచ్చునూర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చునూర్ గ్రామానికి చెందిన బొంగాని రాజు(39) కొన్ని రోజులుగా నరాల బలహీనతతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా మనోవేదన చెందుతున్నాడు. రాజు భార్య తన తల్లిగారింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున రాజు తల్లి బొంగాని మల్లవ్వ చూసి స్థానికులకు తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఇల్లందకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని లక్ష్మాజిపల్లె గ్రామానికి చెందిన రావుల రాజుకు పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేశారు. ఇటీవల అతడి సెల్‌ఫోన్ పోయింది. దీంతో అతడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సెల్‌ఫోన్ గుర్తించి రాజుకి అప్పగించారు.

మక్తపల్లివాసికి భారత సమ్మాన్ పురస్కారం


చింతం నరేందర్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన చింతం నరేందర్ ఇటీవల న్యూఢిల్లీలో విధానసభ స్పీకర్ శ్రీరాం నివాస్ గోయల్ చేతుల మీదుగా భారత సమ్మాన్ పురస్కారం అందుకున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన నరేందర్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పలు ఇన్నోవేటివ్ జర్నల్స్ మార్కెట్లో విడుదల చేసినందుకు గానూ చింతం నరేందర్‌ను ఈనెల 23న ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

అంజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

● నిధులు దుర్వినియోగం చేశాడని అభియోగం

మల్యాల, ఫిబ్రవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలం పాటల ఇన్‌చార్జిగా విధులు నిర్వహించిన కె.శ్రీనివాసాచారిని సస్పెండ్ చేస్తూ ఈవో. టి.వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం పరిధిలోని వ్యాపారులు చెల్లించిన టెండర్లకు సంబంధించిన రూ.37.90లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ సస్పెన్షన్ వేటు వేశారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారీగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వాటిని దుర్వినియోగం చేసినట్లు వారం రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు గురువారం సస్పెన్షన్ చేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఈవో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని లోతుగా విచారణ జరిపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను కోరుతున్నారు.

గిరిజన క్రీడా పాఠశాలల్లో
ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: రాష్ట్రంలోని గిరిజన క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆదిలాబాద్ జిల్లా బాలుర మోడల్ స్పోర్ట్స్ పాఠశాల(జాతర్ల), కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని బాలుర పాఠశాల, ఆదిలాబాద్ జిల్లా బాలుర పాఠశాల(ఉట్నూర్), మహబూబ్‌నగర్ జిల్లా కొత్తగూడ బాలుర పాఠశాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా బాలికల పాఠశాల, కొత్తగూడెం జిల్లా కాచనపల్లి బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. విద్యార్థుల వయస్సు 31-08-2024 నాటికి 9 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహదారుఢ్య పరీక్షల అనంతరం ఎంపిక చేస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మార్చి 4 నుంచి 6వరకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 90591 75379 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రమణారెడ్డి, పీవీకే కిషోర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో న్యూరో డాక్టర్ల 8వ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో గల భద్రకాళి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు తెలియచేశారు. శుక్రవారం రెనే ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్, అంబర్ డిస్క్ సర్జరీలు, చల్మెడ మెడికల్ కాలేజీలోని న్యూరో విభాగం ఆధ్వర్యంలో మెదడు, వెన్నుపాముకు సంబంధించిన లైవ్ సర్జరీలు ఉంటాయని తెలిపారు. న్యూరో విభాగంలో వచ్చిన అధునాతన వైద్యం గురించి లైవ్ సర్జరీల ద్వారా తెలుసుకుంటారని అన్నారు. మార్చి 2న సాయంత్రం నగరంలోని వీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సు న్యూరో డాక్టర్లు, న్యూరో వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వేములవాడలో జాతర ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ ఫిబ్రవరి 29 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆలయ ఈఈ రాజేష్, డి ఈ రఘునందన్ లతో కలిసి ఆలయ పరిసరాలలో జాతర ఏర్పాట్లు పరిశీలించి అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాతర సందర్భంగా తాగునీటి సరఫరా, క్యూ లైన్ల నిర్వహణ, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.


నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రం ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు, నాగేంద్ర సహిత మానసాదేవి విగ్రహాలు

కోరుట్ల, ఫిబ్రవరి 29 : పట్టణంలోని సత్య అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రస్థాపన కార్యక్రమాన్ని వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్, కపిల్‌శర్మ మంత్రోత్సరన మధ్య ఘనంగా సాగింది. ఈ సందర్భంగా వాస్తు దేవతా పూజలతో పాటు నాగేంద్ర సహిత మానసాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, నిర్వాహకులు గడ్డమీది రాజన్న, మక్కు ధర్మరాజు, దామోదర్ పాల్గొన్నారు.

ఈ నెల14న ఎస్‌యూలో కామర్స్ మీట్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ మల్లేష్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మార్చి 14న శాతవాహన వికల్ప2024 (కామర్స్ మీట్)ను నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ గురువారం కామర్స్‌మీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్వం పెంపొందించుకోవటానికి శాతవాహన వికల్ప ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందుకే విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ,పీజీ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శాతవాహన వికల్ప-2024 కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే కామర్స్‌మీట్ వల్ల విద్యార్థులు వివిధ అంశాలపట్ల అవగాహన పెంచుకొని నూతన మెలుకువలు నేర్చుకోవచ్చని అన్నారు. కామర్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రేరణ-2024 రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, బి నరేష్, డాక్టర్ పరశురాములు, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్‌టీపీపీ స్టేజ్-1 నిర్మాణం సంపూర్ణం

● 800 మెగావాట్ల రెండో యూనిట్‌కు కమర్షియల్ ఆపరేషన్(సీవోడీ) ప్రకటన

● అందుబాటులో 1600 మెగావాట్లు ● 4న జాతికి అంకితం చేయనున్న ప్రధాని

జ్యోతినగర్, ఫిబ్రవరి 29: ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్ 1 నిర్మాణం సంపూర్ణమైంది. ఈ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల సామర్థ్యం గల 2వ యూనిట్‌ను గురువారం అర్ధరాత్రి(00.00 గంటలు) కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ)గా ప్రకటించారు. ఈ యూనిట్ పూర్తిస్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడం, సీవోడీ ప్రకటనతో మొత్తం 1600 మెగావాట్ల(800 మెగావాట్ల 2 యూనిట్లు) మొదటి దశ పూర్తయింది. 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు సంబంధించి ఫిబ్రవరి 11న ట్రయల్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఐదు నెలల క్రితమే 800 మెగావాట్ల సామర్థ్యంగల 1వ యూనిట్‌ను సీవోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో టీఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేస్తారు. స్టేజ్-2లో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది. అయితే స్టేజ్ 2కు సంబంధించి కీలకమైన విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకోవాల్సి ఉంది. స్టేజ్ 2కు ఇప్పటికే ఎన్టీపీసీ బోర్డు(బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు) అనుమతి ఉంది. కాగా, మార్చి 4న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెకు స్టేజ్ 1ను జాతికి అంకితం చేయనున్నారు. 4న ప్రధాని ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా అక్కడి నుంచే వర్చువల్ విధానంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని సమాచారం.

● సుదీర్ఘ కాలం తరువాత

అనేక సవాళ్లు, అవాంతరాల తరువాత తెలంగాణ సూపర్ థర్మల్ ప్రాజెక్టు పూర్తయింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 4000 మెగావాట్ల ప్రాజెక్టును ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నెలకొల్పాలని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా 2016లో పునాదిరాయి పడి స్టేజ్-1 మొదట్లో వేగంగా నిర్మాణ పనులు జరిగినా కరోనా, సాంకేతిక కారణాల వల్ల తీవ్ర జాప్యమైంది. 2020-21లోనే ప్రాజెక్టులోని మొదటి, రెండవ యూనిట్లను పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించినప్పటికీ కరోనా, సాంకేతిక సమస్యలు రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. ఏడాదిన్నర కాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగంగా చేయడం ద్వారా స్టేజ్ 1లో రెండు యూనిట్లు ఉత్పత్తి దశకు చేరాయి. రామగుండంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) 800 మెగావాట్ల 2వ యూనిట్ ఉత్పత్తి దశలోకి రావడంతో ఎన్టీపీసీ సంస్థ స్థాపిత సామర్థ్యం 74,758 మెగావాట్లకు చేరింది.



తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు

యువకుడి ఆత్మహత్య



చొక్కాల అరవింద్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 29:తాను ప్రేమించిన అమ్మాయికి వేరే యువకుడితో వివాహం కుదరడంతో మనస్థాపం చెందిన చొక్కాల అరవింద్(20) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన చొక్కాల లక్ష్మణ్-దేవవ్వ దంపతుల కుమారుడు చొక్కాల అరవింద్ అనే యువకుడు ఓ యువతిని కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. అయితే సదరు యువతికి వేరే అతనితో వివాహం కుదిరింది. తనను కాదని వేరే అబ్బాయిని వివాహం చేసుకుంటుందనే కోపం పెంచుకున్నాడు. దీంతో అరవింద్ సదరు అమ్మాయితో దిగిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయడంతో సమస్య పెద్దదైంది. హైదరాబాద్‌లో ఉన్న అరవింద్‌ను తండ్రి మందలించి ఇంటికి రావాలని కోరారు. ఇంటికి వస్తున్నానని చెప్పిన అరవింద్ వేములవాడ నందికమాన్ సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికి ఎదిగిన కొడుకు ప్రేమ విషయంలో మనస్థాపం చెంది మృతి చెందడంతో కన్నవారు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని గాలిపల్లి సమీపంలో కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరుల వివరాల ప్రకారం వల్లంపట్ల గ్రామానికి చెందిన దయ్యాల ఎల్లయ్య, ముద్దాల బాలయ్య, పట్టి ఎల్లయ్య, దయ్యాల లచ్చయ్యలు మేతకోసం గొర్రెలను గురువారం గాలిపెల్లి గ్రామ సమీపంలోకి తీసుకెళ్లారు. అటుగా వచ్చిన కుక్కలు గొర్రెలపై దాడిచేయడంతో 20గొర్రెలు, మేకలు మృతిచెందాయి. సంఘటనలో తమకు దాదాపు రూ. 1.5లక్షల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్లకాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 29 : ముండలంలోని ఆవునూర్ పరిధిలో గల ఎగువమానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించినట్లు ఆర్‌ఐ శ్యాంకుమార్ గురువారం తెలిపారు. ఇసుక కోసం టోకెన్ తీసుకొని అనుమతి తీసుకున్న స్థలంలో కాకుండా వేరే చోటకు తరలిస్తుండగా పట్టుకొని ఠాణాకు పంపినట్లు తెలిపారు. ట్రాక్టర్లపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవం, స్వామివారు (ఇన్‌సెట్‌లో)

బీర్‌పూర్,ఫిబ్రవరి 29: బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం స్వామి వారి రథోత్సవం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని గుట్టపై నుంచి గుట్ట కిందికి ప్రత్యేకంగా అలంకరించిన శావపై ఆశీనుల గావించి డప్పు చప్పుళ్ల మధ్య గుట్ట కిందికి తీసుకవచ్చారు. రథం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని రథంపై ఆశీనులు గావించి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట కింద ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన ఆరుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, పోలీసు సిబ్బందితో డీఎస్పీ రఘుచందన్, జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్ ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ జాతర బ్రహ్మోత్సవాలలో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్ రావ్, బీర్‌పూర్ సింగిల్‌విండో చైర్మెన్ కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎనగంటి స్వామ్రాట్, ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కొల్మూల రమణ, మాజీ ఆలయ చైర్మెన్‌లు గోనే రమణ రావ్, నేరెల సుమన్, మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మధు కుమార్, చిన్న సంతోష్, క్లర్క్ రాజయ్య, సిబ్బంది వెంకటేష్, మల్లయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కస్టడీలో నందెల్లి మహిపాల్, కృష్ణగౌడ్

● కరీంనగర్‌లో సోదాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం



నందెల్లి మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని సోదాలకు వెళుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 29: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో ఈ నెల 20న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. అనంతరం నాలుగు ప్రత్యేక పోలీసు టీంలు ఏకకాలంలో జ్యోతినగర్, శర్మనగర్, ముకరంపురల్లో మహిపాల్ ఇళ్లతో పాటు అతడి అనుచరుల ఇళ్లు, కార్యాలయాల్లో 6 గంటల పాటు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందెల్లి మహిపాల్ సమక్షంలోనే ఆయన ఇళ్లు, కార్యాలయంలలో సోదాలు జరిపారు. శుక్రవారం ఉదయం వరకు మహిపాల్ పోలీసుల కస్టడీలో ఉండనున్నారు.

● రేకుర్తిలోని ఒక భూమికి సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను నిజమైనదిగా చూపించి బాధితుడి నుంచి కోటి 37 లక్షల రూపాయలు వసూలు చేసిన కేసులో నిందితుడిగా జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌ను గురువారం కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఈనెల 9న కృష్ణగౌడ్ అరెస్టు అయి జైలులో ఉండగా అతన్ని మరింత లోతుగా విచారించాలని పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా 24 గంటల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ మేరకు కృష్ణగౌడ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ జరుపుతున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

భూ తగాదాల్లో తలదూర్చిన వ్యక్తిపై పీడీ యాక్ట్



పీడీ యాక్ట్ అమలు కాపీ అందజేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 29: భూ తగాదాల్లో తలదూర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన పి.రమణారెడ్డికి గురువారం వేములవాడ పోలీసులు పీడీయాక్టు నిర్బంధ ఉత్తర్వులు అందజేసి అమలుచేసి చర్లపల్లి జైలుకు తరలించారు. చంద్రంపేటకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి రిపోర్టర్‌గా పనిచేస్తూ భూ సమస్యలు, ఇతర సమస్యల్లో తలదూరుస్తూ అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతూ ప్రజలకు భయభ్రాంతులకు గరిచేస్తున్నాడని అతనిపై సిరిసిల్ల, తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడ పోలీస్‌స్టేషన్‌లలో దాదాపు 10కేసులు నమోదయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. అయినప్పటికీ అతని కార్యకలాపాలు మార్చుకోనప్పటికీ జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతి పీడీ యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు ఇవ్వగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు అతనికి పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం కేసులో
పెరుగుతున్న బాధితులు

మరో ఏడుగురి వద్ద రూ. 6లక్షల టోకరా

గంభీరావుపేట, ఫిబ్రవరి 29: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల ఆశతో మోసపోయిన బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 9 లక్షలు దండుకున్న ఘటన మరిచిపోక ముందే ఇదే కోవలో మరికొందరు వెలుగులోకి వచ్చారు. వీరిని మోసం చేసింది కూడా ఎర్రవెల్లికి చెందిన అర్జున్ కావడం విస్మయం కలిగిస్తోంది. ఉద్యోగాల పేరిట వరుస టోకరాలు చూస్తుంటే అర్జున్ చేతిలో ఇంకెంత మంది మోసపోయారనే అనుమానాలు బలపడుతున్నాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో పలువురు అమాయక యువకులను మోసం చేసిన వ్యక్తుల్లో ఒకరైన ఎరవెల్లికి చెందిన అర్జున్ గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు చెందిన మరో ఏడుగురిని ఇదే రకంగా మోసం చేశాడనే అంశం వెలుగు చూడటం కలకలం రేపుతోంది. అర్జున్ శివ పేరుతో సూర్య, సుజాత అనే వ్యక్తుల సహకారంతో లింగన్నపేటలో మరో ఘరానా మోసానికి తెరలేపాడు. దాదాపు లింగన్నపేటకు చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద కాస్ ఫౌండేషన్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో పెట్టించే అధికారులు సూర్య, సుజాత అంటూ వారిని పరిచయం చేస్తూ అర్జున్ అలియాస్ శివ పలు దఫాలుగా డబ్బు వసూలు చేశాడు. లింగన్నపేటకు చెందిన బాధితురాలు తండ్రి పురుషోత్తం గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్‌కు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడైన అర్జున్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ


ముస్తాబాద్, ఫిబ్రవి 29: ముస్తాబాద్ మండల పోలీసు ఠాణా పరిధిలో ఇటీవల నమోదైన అట్రాసిటీ కేసులపై సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ గురువారం విచారణ చేశారు. ఎస్టీ మహిళ పెట్టిన కేసుతో పాటు, పారిశుధ్య సిబ్బంది పెట్టిన అట్రాసిటీ కేసులపై క్షేత్ర స్థాయిలో డీఎస్పీ విచారణ చేశారు. ఏఎస్సై వెంకటరమణ, పీసీ కుమార్ ఉన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో 10న మంత్రి 'పొన్నం'కు సన్మానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో మార్చి 10న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మాన కార్యక్రమం ఉంటుందని జిల్లా గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం నగరంలోని మాచర్ల గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల గణన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పొన్నం ప్రభాకర్‌కు సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున గౌడ కులస్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాచర్ల ప్రసాద్, పొన్నం శ్రీనివాస్, పొన్నం సత్యం, జగన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్



సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయకార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులను గురువారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం జరిగి సంవత్సరాలు గడిచిపోయాయని, లబ్ధిదారులను సైతం గ్రామసభల ద్వారా ఎంపిక చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్లను పంపిణీ చేయలేదన్నారు. ఓపిక నశించిన లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూంలలో ఉంటున్నారని తెలిపారు. వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలని లేనట్లయితే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, నాయకులు పసుల బాలరాజు, బైండ్ల మల్లేశం, మహేష్, నర్సవ్వ, రేణుక, లక్ష్మి, బాగ్యలక్ష్మి, చంద్రయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు టెట్ అర్హత మార్కులు తగ్గించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే అర్హత పరీక్ష(టెట్)లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే, ముందుగా బీఈడీ, టీటీసీ చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించాల్సి ఉందని తెలిపారు. ఈ పరీక్షలో ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీలు 60 మార్కులు సాధించాలన్నారు. 89 సాధించిన ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఒక్క మార్కుతో వేల సంఖ్యలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కావున ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు బీసీల మాదిరిగానే 75 మార్కులకే అర్హత కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

చందుర్తి, ఫిబ్రవరి 29: జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ నిరుపేద మృతి చెందగా మృతదేహం చందుర్తి మండలంలోని బండపల్లికి చేరుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతుగంటి భూమయ్య (46) గుండెపోటుతో ఫిబ్రవరి 3న గల్ఫ్‌లో మృతి చెందా డు. రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా గుం డెపోటు వచ్చింది. సహచరులు వెంటనే ఆసుపత్రి తరలిం చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతదేహం గ్రామానికి రావడంతో కుటుంబ సభ్యులు రోదించడం కంటతడి పెట్టించింది. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

● పల్లిమక్తలో చోరీ ● రూ.70 వేలు అపహరణ



పల్లిమక్తలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కోనరావుపేట, ఫిబ్రవరి 29: తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతున్నారు. గత నెలలో కూడా సుమారు నాలుగు గ్రామాల్లో వరస దొంగతనాలు జరిగాయి. అది మరవక ముందే బుధవారం రాత్రి పల్లిమక్త గ్రామంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనిగరం దేవవ్వ, నందగిరి వజ్రవ్వల ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో చోరీ చేశారు. తాళాలను పగలగొట్టి శనిగరం దేవవ్వ ఇంటిలో 70 వేల రూపాయలను అపహరించారు. నందగిరి వజ్రవ్వ ఇంటిలో కూడా తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంటిలో ఏమి దొరకలేదు. విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి దొంగతనం జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపడుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఈడీ



బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న ఈడీ వినోద్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి29: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌ను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. నిజా మాబాద్ పాయింట్‌పై బస్సుల రాకపోకల వివరాలు ప్రయాణి కులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికులు కూర్చోవ డానికి మరిన్ని బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంతో రద్దీ పెరిగిందని, రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రజనీ కృష్ణ, సూపర్‌వైజర్ జీఎల్‌నారాయణ, మల్హర్‌రావు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థికి రాష్ట్ర స్థాయి బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 29: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థి జాతీయ సైన్స్ దినోత్సవ పాటల పోటీల్లో బహుమతి సాధించాడు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పాటల పోటీల్లో పాఠశాలకు చెందిన అభిరామ్ బహుమతి సాధించాడు. హన్మకొండలో నిర్వ హించిన ప్రత్యేకకార్యక్రమంలో పర్యావరణ సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సిక్తాపట్నాయక్, హన్మకొండ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుని సన్మానం పొందాడు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు

-మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: నగర పరిశుభ్రత లో ప్రధాన పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగర పాలక సంస్థలో పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికుడు ఇల్లందుల మల్లయ్య సన్మాన కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలతో పాటు పదవీవిరమణ సహజమేనని అన్నారు. పదవీ విరమణ చేస్తున్న మల్లయ్య విధుల పట్ల అంకితభావంతో పనిచేశాడని, ఆయన సేవలను అభినందించారు.

పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితంగానే నగర పాలక సంస్థకు సఫాయి మిత్రచాలెంజ్ లాంటి అవార్డులు వచ్చాయని, ప్రజలు ఆరోగ్యంగా జీవించడంలో వీరి పాత్ర వెలకట్టలేనిదని మేయర్ కొనియాడారు. గతంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచడంతోపాటు ప్రతినెలా 5వతేదీన వారికి వేతనాలను చెల్లించి కార్మికులను గౌరవిస్తున్నామని చెప్పారు. ఈకార్యక్ర మంలో కార్పొరేటర్లు సరిళ్లప్రసాద్, గంట కల్యాణి శ్రీనివాస్, ఐలేందర్‌యాదవ్, ఆర్వో ఆంజనేయులు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మానేరు'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో యూకేజీ విద్యార్థులను పై తరగతికి ప్రమోట్ చేస్తూ కాన్వకేషన్ పట్టాను అందించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన విద్యాసంస్థల అధినేత కె.అనంతరెడ్డి మాట్లాడుతూ లక్ష్య సిద్ధితో సాధన చేస్తే ప్రతి విద్యార్థి సత్ఫలితాలు సాధిస్తారని అన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో విదాసంస్థల డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటీ ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం సభ్యులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 29: హుజూరాబాద్ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నికలు గురువారం స్థానికంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడిగా వెలుగందుల వీరుపాక్షం (విక్కీ), పట్టణాధ్యక్షుడిగా సుద్దాల హరిశంకర్, యువజన సంఘం అధ్యక్షుడిగా కె నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్‌లు శాలువాతో సత్కరించారు. కొత్త కమిటీ ఎన్నికల ప్రకియను భూపతి కుమారస్వామి, అకినపల్లి అనిల్‌కుమార్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో క్యాస చక్రధర్, క్యాస ఉపేందర్, శివనాథుని వేణు, రాజన్న, శ్రీకాంత్, ఎస్ఆర్‌బీ, తాడికల్ శ్రీనివాస్, గుప్తా, రవి, పున్నంచందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన లష్కర్‌కు సన్మానం

హుజూరాబాద్, ఫిబ్రవరి 29: హుజూరాబాద్ మండలం కేసీ క్యాంపులో 39సంవత్సరాలు సుదీర్ఘంగా రైతులకు సేవలందించిన లష్కర్ దొర్లై రాజు పదవీ విరమణ సందర్భంగా గురువారం సన్మానించారు. ఎస్సారెస్పీ ఈఈ శశిభూషన్, డీఈ రాములు దొర్లై రాజు దంపతులను శాలువాతో సత్కరించారు కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

ఇల్లందకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని సీతంపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా భివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరైనా కులాల పేరుతో దూషించినట్లయితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని సన్మానించిన తుమ్మేటి

జమ్మికుంట రూరల్, ఫిబ్ర వరి 29: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సలహాదారు డిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ షబ్బీర్ అలీని హైదరాబా ద్‌లోని తన స్వగృహంలో మాజీ మా ర్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మే టి సమ్మిరెడ్డి గురువారం కలిసి సన్మా నించి అభినందించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న సమ్మిరెడ్డి

ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి

-కలెక్టర్ పమేలా సత్పతి



జమ్మికుంటలో వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్

జమ్మికుంట, ఫిబ్రవరి 29: విద్యార్థులను ఉపాధ్యాయులు సైన్స్ ప్రయోగాలు చేసేందుకు ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పట్టణం లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శించారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన రిపోర్టును జిల్లా విద్యాధికారి సీహెచ్ జనార్దన్‌రావు కలెక్టర్‌కు అందజేశారు. స్పం దించిన కలెక్టర్ ప్రభుత్వ బాలుర పాఠశాలకు చేరుకొని విద్యార్థుల వైజ్ఞానిక ప్రద ర్శనను పరిశీలించి సూచనలు చేశారు. భౌతిక, జీవన శాస్త్ర ఉపాధ్యాయులతో మాట్లాడి ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రధానంగా సోలార్ ఎక్లిప్స్ ఆకట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో విడపు శ్రీనివాస్, ప్రధానో పాధ్యాయులు ఆకుల సదానందం, జీవన, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు స్రవంతి, ప్రతిభ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

● **ప్రయోగాలపై దృష్టి సారించాలి**

రామడుగు: విద్యార్థులు ప్రయోగాలపై దృష్టి సారించాలని కొడిమ్యాల ఫారె స్ట్ రేంజ్ ఆఫీసర్ బుర్ర లత అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి హైస్కూల్‌లో సైన్స్ డేను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలను పరిశీ లించి అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ పులి ఆంజనేయులు, పాఠశాల కరస్పాండెంట్ శ్రీ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ ఆలె వెం కట్‌నారాయణ, డైరక్టర్లు మునీందర్‌రెడ్డి, భూమయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరా పాఠశాలలో ఘనంగా 'అర్వేష్-24'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నగరంలోని కోరా ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల నమూనాలతో నిర్వహించిన అర్వేష్-2024 ఆకట్టుకుంది. శరీరంలోని భాగాలను, వాతావరణ కాలుష్య నియంత్రణ, బిందు సేద్యం, హైడ్రాలిక్ లిఫ్ట్, టెస్లా కాయిల్, భూకంపం అప్రమత్తత లేఖిని, అయోధ్య రామమందిరం, వివిధ రకాల వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వర్దప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వివేకానంద విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వివేకానంద ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో మార్చి 2 నుంచి 4 వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలలో విశేష ప్రతిభ చాటిన వివేకానంద కళాశాల విద్యార్థులు కె శివాజీ, బి ప్రవీణ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపియైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వి ఆగమ్‌రావు, ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాస్, ఏవో బండి శ్రవణ్‌కుమార్, ఏసీవో బి సంపత్‌కుమార్, బి రామేశ్వర్‌రావు అధ్యాపక బృందం అభినందించారు.

రైతుల సంఘటితంతో అభివృద్ధి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 29: రైతుల సంఘటితంతో సంఘం అభివృద్ధి చెందుతుందని మన ఆదర్శ రైతు ఉత్పత్తి కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ న్యాలకొండ శంకరయ్య అన్నారు. గురువారం కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పెంచడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తా మన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత, గ్రామ భారతి రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి, కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, మండల డైరెక్టర్లు, గ్రామస్థాయి డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 29: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆదేశించారు. గురువారం మున్సి పల్ చైర్మన్ రుద్ర రాజు అధ్యక్షతన సాధారణ సమా వేశం జరిగింది. సమా వేశంలో రెసిడెన్సి యల్ టాక్స్‌ను 0.25 శాతం నుంచి 0.12.5 శాతానికి తగ్గించడంతో పాటు, కమర్షి యల్ ట్యాక్స్‌ను 0.30శాతం నుంచి 0.25 శాతానికి తగ్గిస్తూ కౌన్సిల్ తీర్మా నించింది. ఈకార్యక్రమంలో కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు వసాల రమేష్, జేరిపోతుల మొండయ్య, జేరిపోతుల అంజలి, మానుపాటి వేణుగోపాల్, విజయ, గండు రాంబాబు, వేముల కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో విదేశీ విద్యపై అవగాహన సదస్సు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి29: ఎస్సారార్ కళాశా లలో యూరోప్ ఖండంలోని ప్రఖ్యాత విశ్వ విద్యాలయాల్లో ఉన్నత విద్యకు గల అవకా శాల గురించి, ఉపకార వేతనాలు ప్రవేశ విధి విధానాలపై ఒక రోజు అవగాహన సదస్సును ఎడ్యుటు ఎక్సెల్ వారు ఎస్ఆర్ఆర్ కళాశాల టీఎస్‌కేసీలు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎడ్యు టు ఎక్సెల్ సంస్థ ప్రతినిధి రాకేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ జర్మనీ,ఫ్రాన్స్ మరియు స్పెయిన్ మొదలైన దేశాలలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల్లో గల ఉన్నత విద్యా అవకాశాలను గురించి విద్యార్థులకు వివరించారు. మరో ప్రతినిధి ప్రమోద్ మాట్లాడుతూ ఆయా విదేశీ విశ్వ విద్యాలయాల్లో గల ఉపకార వేతనాల గురిం చి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, టీఎస్ కేసీ సమన్వయ కర్త డాక్టర్ సీహెచ్ మారుతి, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ ఆడెపు శ్రీనివాస్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ఎదుర్కోలు వేడుక



స్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న పద్మశాలి కులస్తులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి29: నగరంలోని విద్యానగర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు వానమామలై పవనకుమారాచార్యుల ఆధ్వ ర్యంలో గురువారం ఉదయం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూల మంత్ర హోమాలు, ధ్వజారోహణం, సాయం త్రం హంస వాహన సేవతో పాటు శ్రీవారికి ఎదుర్కోలు వేడుక వైభవంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి ఆడపడుచులు శ్రీపద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు, సారెలను సమర్పించారు. పద్మశాలి కుల సంఘ ప్రతినిధులను సన్మానించారు. కార్యక్ర మంలో ఆలయ అధ్యక్ష, కార్య దర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి దూలూరి సత్య నారాయణ, ఉపాధ్యక్షులు మడతల మీరయ్య, సభ్యులు గజవాడ ఆంజనేయులు, బల్మూరి కొండాల్ రావు, వడ్లూరి వేంకటేశం, పాకాల తిరుపతిరెడ్డి, ఆకారపు రుద్రమ్మ, శ్రీపెరంబు దూరు పుష్పలత, కొల్లూరి భారతమ్మ, శ్రీరామోజు రాజవీరబ్రహ్మం, పాల్గొన్నారు.

ప్రజాహిత యాత్రను విజయవంతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ



శంకరపట్నంలో ప్రజాహిత యాత్రపై చర్చిస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం, ఫిబ్రవరి 29: శంకరపట్నం మండలంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టబోయే ప్రజాహిత యాత్రని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ అన్నారు. శంకరపట్నం మండల బీజేపీ నాయకులు గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ శంకరపట్నం మండల పరిధిలో ఆదివారం నంఁచి నిర్వహించే బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత పాదయాత్రపై మండల బీజేపీ నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి వెళ్లాలన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు తెలియజే యాలని పిలుపునిచ్చారు. కేంద్రం మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొంరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగ జైపాల్, నాయకులు దాసారపు నరేందర్, కోయడ అశోక్, జానపట్ల రాజిరెడ్డి, సుధగోని శ్రీనివాస్, వడ్లకొండ రాజేందర్, కనకం సాగర్, సారయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర హుండీ లెక్కింపు

హుజూరాబాద్, ఫిబ్రవరి 29: హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగిన శ్రీసమ్మ క్క-సారలమ్మ జాతర హుండీ లెక్కింపు గురువారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో సేవా సమితి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈవో సుధా కర్, సీఐ రమేష్, జాతర కమిటీ చైర్మన్ మూగల రాజి రెడ్డి, డైరెక్టర్ల ఆధ్వర్యంలో లెక్కించగా టికెట్ల ద్వారా రూ. 3,53,015, వేలం పాటల ద్వారా రూ. 1,58,500, హుండీ ద్వారా రూ. 10,49,941 మొత్తం రూ. 15,61,5 16లు ఆదా యం వచ్చినట్లు తెలిపారు.

వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు ఎంపీడీవో కార్యా లయంలో దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వ హించారు. 7,40,116 రూపాయలు వచ్చి నట్టు కమిటీ స భ్యులు తెలిపారు. లెక్కింపులో ఎండో మెంట్ అధికారులు శ్రీనివాస్, సుప్రియ, కమిటీ సభ్యులు దాసారపు ప్రభాకర్, మ్యాకల సమ్మిరెడ్డి, భిక్షపతి, చిట్టి, వంశీకృష్ణ, సునిల్, బాబురావు, రజాక్, అమీద్ పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 29: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో మార్చి 30వ తేదీ వరకు వందశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని కమిషనర్ ఎండి ఆయాజ్ అ న్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పన్నుల వసూళ్ల కోసం అధికారులతో కలిసి కమిషనర్ ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు త్వరగా వసూళ్లు చేయాలని కోరారు. మున్సిపల్ పరిధిలో నెలా ఖారు వరకు బకాయిలు ఉండద్దని సూచించారు. సకా లంలో పన్నులు చెల్లించకుంటే జరిమానా పడుతుందని ప్రజలకు వివరించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారి భాస్కర్, బిల్ కలెక్టర్ సంపత్ ఉన్నారు.

ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌మాదిగ

గంగాధర, ఫిబ్రవరి 29: ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయడానికి నాయకత్వం అనునిత్యం కష్టపడాలలని జిల్లా అధ్యక్షుడు అనిల్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ చొప్పదండి నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్స వాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గంగాధర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా గంగాధర రవి, ప్రధాన కార్యదర్శిగా శనిగారపు వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా అస్తపురం వెంకటేశ్, ప్రచార కార్యదర్శిగా గంగాధర ఉదయ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పదవీ విరమణ ఉండదు



ఇందుర్తి మాజీ సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ వినీత

చిగురుమామిడి, ఫిబ్రవరి 29: ప్రజాక్షేత్రంలోకి వచ్చిన తర్వాత నాయకులు సేవ చేసేందుకు పదవీ విరమణ ఉండదని ఎంపీపీ కొత్తవినీత-శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల పదవీ కాలం పూర్తయినా 17 గ్రామాల మాజీ సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు సన్నీల్ల వెంక టేశం, శ్రీమూర్తి రమేశ్, జక్కుల రవీందర్, బోయిని శ్రీనివాస్, పిట్టల రజిత, సుద్దల ప్రవీణ్ మాట్లాడుతూ కరోనా కాలంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేశామని తెలిపారు. సర్పంచ్‌లతో పాటు ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీవో నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి మధుసూదన్, తహసీల్దార్ ఇప్ప నరేందర్, జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజామొయినోద్దిన్, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 29: పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ లేబర్ కమిషనర్, కలెక్టర్ ఏవోకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె సుల్తాన్, సదానందం, వంశీకృష్ణ, రజాక్, సుబ్బారావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులతో ఎంపీ మాటా మంతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఢిల్లీ వెళ్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ట్రినిటి కళాశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన ఇంటర్ విద్యార్థులతో గురువారం మాట్లాడారు. ఉదయం ఢిల్లీ వెళ్తున్న బండి ఇంటర్ విద్యార్థులను చూసి కారు ఆపి దిగి వారితో ముచ్చటించారు. ఇంటర్ సెకండియర్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఆయన సూచించారు.

వైస్ ఎంపీపీని అభినందించిన మాజీ ఎంపీ

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 29: కొత్తపల్లి వైస్ ఎంపీపీగా ఎన్నికైన భూక్య తిరుపతి నాయక్‌ను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నాయ కున్ని వైస్ ఎంపీపీగా ఎన్నుకున్న ఎంపీటీసీలను అభినందించారు. చింత కుంట జనరల్ స్థానం నుంచి పోటీ చేసి ఎంపీటీసీగా గెలుపొంది, వైస్ ఎంపీపీగా ఎన్నిక కావడం ఆయన చేసిన కృషికి ఫలితమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు రాజునాయక్, శ్రీనివాస్ నాయక్, రవినాయక్, జక్కుల నాగరాజు, దూలం సంపత్ పాల్గొన్నారు.

'వెలిచాల పొలిటికల్ టూరిస్ట్'

భగత్‌నగర్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు ఒక పొలిటికల్ టూరిస్ట్ అని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు విమర్శించారు. గురువారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ ఏనాడు ప్రజల సమస్యల కోసం పోరాటం చేసింది లేదన్నారు. కేవలం అధికార కాంక్షతోనే రాజకీయ పార్టీలో కొనసాగు తున్నా రన్నారు. ఎన్నికల సమయంలోనే ఏదో ఒక హడావిడి చేస్తు కనబడతారన్నారు. గతంలో పిఆర్‌పి, బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్‌లో అదే హడావిడి చేస్తున్నారన్నారు. కరీంనగర్‌లో ఎంపీగా బండి చేసిన అభివృద్ధిపై ప్రజాహిత యాత్రలోనే ప్రజలకు వివరిస్తున్నారన్నారు. విషయ పరిజ్ఞానం లేని రాజేందర్‌రావు ఎంపీపై అనవసరంగా మాట్లాడుతున్నా రన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

సూపర్‌వైజర్లకు సన్మానం

భగత్‌నగర్, ఫిబ్రవరి 29: ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న సూపర్ వైజర్లకు గురువారం అధికారులు ఘనంగా సన్మానించారు. రీజినల్ మేనేజర్ కార్యాలయంలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న ఐతం సుధాకర్, పోశెట్టి శ్రీనివాస్‌లను సన్మానించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ కె సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పర్సనల్ ఆఫిసర్ ఎంచంద్రయ్య, కుటుంబ సభ్యులు, రీజినల్ మేనేజర్‌కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

భగత్‌నగర్, ఫిబ్రవరి29: ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగు లను కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతిరావు, పివి లక్ష్మి, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఎస్‌రవీందర్, కెజయాకర్, ఎండిఎం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 29: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ శ్రీమరకరత లింగరాజరాజేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. స్వామివారికి పంచామృతఫల పంచామృత అభిషేకం, భక్తు లచే మహామృత్యుంజయ హవనం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు దేవరాజు ప్రశాంత్‌శర్మ, దేవాలయ అధ్యక్షుడు నందాల తిరుపతి, గౌడ నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, కోరుకంటి వేణుమాధవరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

చొప్పదండి, ఫిబ్రవరి 29: పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యలను పరిష్కరించాలని నాల్గో వార్డు కౌన్సిలర్ చేపూరి హేమ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆమె మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

ఎంపీ దిష్టిబొమ్మ దహనం

చొప్పదండి: ఫిబ్రవరి 29: చొప్పదండి పట్టణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ నాయకుడు న ల్లాల అఖిల్, కాంగ్రెస్ నాయకు లు పద్మాకర్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

గన్నేరువరం, ఫిబ్రవరి 29: మండలంలోని జంగపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీభక్తమార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఎంపీటీసీ గూడెల్లి అంజనే యులు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాంకాళి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 15మంది గైర్హాజరు

మానకొండూర్, ఫిబ్రవరి 29: దేవంపల్లి గురుకుల, మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గు రువారం నిర్వహించిన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్ష 15 మంది గైర్హాజరు అయ్యారు. గురుకుల పాఠశాలలో 192 మంది విద్యార్థులకు గాను 13 మంది, ప్రభుత్వ జూనియ ర్ కళాశాలలో 121 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

గంగాధర, ఫిబ్రవరి 29: గంగాధర మండలం మల్లాపూర్‌లో మృతురాలి కుటుంబానికి తూడి లచ్చయ్య యువసేనా 5వేల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బి య్యం అందజేశారు. గ్రామానికి చెందిన పైడిపల్లి అమ్మా యి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. లచ్చయ్య యువసేనా సభ్యులు కుటుంబాన్ని పరామర్శించారు.

మనోజ్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్

వీణవంక, ఫిబ్రవరి 29: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సజ్జనపు మనోజ్‌కుమార్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో పొ ట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 16వ స్నాతకో త్సవంలో భాగంగా భాషా శాస్త్రంలో ఎంఏ లిం గ్విస్టిక్స్ విభాగంలో ప్రథమ స్థానం పొందగా బుధవారం గవర్నర్, వైస్ చాన్సలర్ కిషన్‌రావు అందజేశారు.

గురుకులంలో ఉద్యోగాలు సాధించిన ప్రత్యూష, అశోక్

శంకరపట్నం, ఫిబ్రవరి 29: తాడికల్ గ్రామానికి చెం దిన కొరిమి ప్రత్యూష, పాండ్రాల అశోక్ ఇటీవల ప్రక టించిన గురుకుల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఉద్యోగాలు సాధించిన ప్రత్యూ ష, అశోక్‌ను పలువురు గ్రామస్థులు అభినందించారు.